# పూతరేకు

"అమ్మా! అమ్మా" అని రెండుసార్లు పిలిచాడు. తల్లి పలకలేదు. గుండ్లు తేలేసింది. "ఏమేవ్! అర్జంటుగా వెంకన్నని పిలువ్.డాక్టర్నితీసుకురావాలి! అమ్మ కూర్చున్నదల్లా పడిపోయింది" అన్నాడు నరసింహం

"అయ్యో! ఏ...ఏమయిందండీ? ఇప్పటివరకూ నానిగాడికి కథ చెప్తున్నారు. వెంకన్న ఎటుపోయాడో ఏమో?" కంగారుగా వస్తూ అంది నరసింహం భార్య.

"అదే తెలీటం లేదు" అంటుండగా కోడలు అనసు వచ్చింది. "అనసూ! బాబేడీ?" అడిగింది అత్త "ఇప్పుడే వస్తానని బజారు కెళ్ళారు" అనసు ముఖంలోనూ ఆందోళనే!

"సరే అమ్మ దగ్గరుండండి. డాక్టర్ని పిలుచుకుని వస్తా" అని వీధిలోకి పరుగెత్తాడు. పావుగంట లోపలే డాక్టరుతో వచ్చాడు. డాక్టరు టెస్టు చేశాడు. ఇంజక్షన్ చేశాడు. మాత్రలు రాసి ఇచ్చాడు. అర్జంటుగా కొని తెమ్మన్నాడు.

అంతలో వచ్చిన వెంకట్రావు డాక్టర్ని చూసి "ఏమయిందీ?" అని అడుగుతుండగా "ఇదిగో వెంకూ! ఈ టేబ్లెట్సు పట్రా" అన్నాడు నరసింహం.

"ఇక్కడ దొరక్కపోతే పట్నం నుండి తేవాలి చాలా ముఖ్యం!" అన్నాడు డాక్టర్.

"సార్! అమ్మకేం ఫరవాలేదా?" నరసింహం

"ముసలావిడ కదా! చెప్పలేం. పరిస్థితి కొంచెం ప్రమాదంగానే కనిపిస్తోంది. అయినా నా ప్రయత్నం లోపం లేకుండా నేను చేస్తున్నా" అన్నాడు డాక్టరు.

వెంకట్రావు నెత్తిమీద బాంబు పడింది!

మూణ్ణెల్ల క్రితం జరిగిన తాతయ్య సంవత్సరీకాలు భారీ ఎత్తున చేసాడు తండ్రి.

భూదానం చేసాడు. గోదానం చేసాడు. హిరణ్యాదానం చేసాడు. (ఇక్కడ ఈ దానాలు సాక్షాత్తు భూములూ, గోవులని అనుకో అక్కర్లేదు, వీటి బదులు కొంత సొమ్మును పురోహితునికి చెల్లిస్తే సరిపోతుంది!) ఇవిగాక - సంతర్పణ భోజనాలకూ, ఇంటికి వచ్చిన చుట్టాలకూ, స్నేహితులకూ బట్టలు పెట్టాడు. ఏవేవో స్టీలు పాత్రలు పెట్టాడు భోజనాలకు వచ్చిన వాళ్ళకు. వీటికి సుమారు పదిహేను వేలు ఖర్చయింది. వచ్చిన వాళ్ళంతా తాతయ్య దాన ధర్మాలను వేనోళ్ళ పొగిడారు. అతని చేతికి ఎముకే లేదన్నారు. ఆ తండ్రికి నరసింహం ముమ్మూర్తులా తగిన కొడుకే అన్నారు అందరూ!

అప్పు మాత్రం తన నెత్తిన పడింది.

సంవత్సరం తినాల్సిన ధాన్యం ఆరమాసాలకే అయిపోయాయి. ముందుల షాపులో నిన్ననే ఖాతా క్లోజ్ చేసేసాడు. ఎక్కడా, ఎవరికీ బాకీలు మరిలేవని తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

ఇప్పుడు మళ్ళీ ఖాతా మొదలు!

ఆలోచిస్తూ నిలబడిన కొడుకును చూసిన తండ్రి, "ఏరా! ఇంకా వెళ్ళలేదా?" అరిచినంత కేకేసాడు. కదిలాడు వెంకట్రావు షాపులో మందులు దొరికాయి. పట్నం వెళ్ళాల్సిన పని తప్పింది.

కానీ

ఆ రాత్రి కాళ రాత్రే అయింది.

నారాయణమ్మ (నరసింహమ్మ తల్లి) కు తెలివి రాలేదు. మంచ దగ్గర ఒక ప్రక్క కొడుకు, మరో ప్రక్క కోడలు! మంచం చివర వెంకట్రావు. క్రింద అనసూయ. ఆమె ఒళ్ళో నానిగాడు! రెప్పలు బరువై కునుకు తీస్తూ ముందుకు వాల్తున్నారు. తెలివొచ్చినప్పుడు నారాయణమ్మని చూస్తున్నారు. నరసింహం ఒకసారి నాడి చూశారు. ఒకసారి ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాడు! అతనికి రాత్రి చాలాదీర్ఘంగా అనిపించింది.

ఎక్కడో కూసిన కోడి కూత వేకువ జాముకు ఎలారపు గంటలా వినిపించింది. ముఖాలు కడుక్కొని కాఫీలు త్రాగారు. వీధిలో తిరుగుతూన్న జనం!

"బాబూ! వెంకూ!" తండ్రి పిలిచాడు.

"ఏనాన్నా"

"అమ్మ కన్ను తెరుస్తుందన్న' నమ్మకం నాకు లేదు. ఎందుకైనా మంచిది అత్తలందరికీ కబుర్లు చేయటం నయమనిపిస్తోంది". అన్నాడు.

"ఇప్పుడెందుకు తొందర?"

"అదికాదమ్మా! తరువాత ఏదన్నా జరిగితే కబురు చెయ్యలేదని నిందవేస్తారు?" అన్నాడు.

"వేస్తే వెయ్యనీయండి. వాళ్ళోచ్చి చేసేదేంలేదుకదా!"

"అమ్మని పిలు ఒసేవ్ ఇట్రా ఓసారి" అని తనే భార్యని పిలిచి విషయం వివరించాడు. టెలిగ్రాం ఇవ్వటమే మంచిదని తల్లీ చెప్పింది వెంకట్రావుకి.

తెల్లారుతూనే డాక్టరు వచ్చాడు. చెయ్యి చూశాడు. "ఎందుకైనా ఈ ఇంజక్షన్లు తీసుకురండి ఆ మాత్రలు ఆపండి" అన్నాడు.

వెంకట్రావుకి డాక్టరు మీద కోపం వచ్చింది.

"ఆ మాత్రానికి అన్ని మాత్రలు వ్రాయటం దేనికి? అనుకుని "డాక్టరుగారూ! అసలింతకీ నానమ్మ బ్రతుకుతుందా?" కటువుగా అడిగాడు. అలా అడిగేసరికి డాక్టరుకు చిరాకేసింది.

"చూడవోయ్! నేను మందులిచ్చే డాక్టర్ని మాత్రమే ప్రాణం పోసే బ్రహ్మదేవుణ్ణి కాదు!" అన్నాడు.

"ఈ ఇంజక్షన్లు లేకపోతే ఏం జరుగుతుంది?"

నానమ్మ చనిపోతుంది!

అయ్యో! పాపం! నానమ్మ ఎంతమంచిది? నాన్న కరణీకం పోయి భారం తనపై పడినప్పుడు

నానమ్మ ఎంతలా బాధపడింది? "పిచ్చికన్నా! నీకెన్ని కష్టాలురా? హాయిగా తిరగాల్సిన చిలకని రెక్కలు కత్తిరించి పంజరంలో బంధించినట్లు సుఖంగా గడపవలసిన నిన్ను మేం నలిపేస్తున్నార రా!" అని కన్నీరు పెట్టింది.

పాపం! ఓపిక, లేకపోయినా, కష్టపడి లేచి ఏవో మూలికలు తెప్పించి వైద్యం చేసి తెచ్చిన డబ్బులు తన చేతిలో పెట్టేది. మందులిచ్చి కూరలూ, పాలూ సంపాదించేది.

అంతేనా?

చిన్నప్పుడే

ఎవరికీ తెలీకుండా డబ్బులిచ్చేది పుట్టిన రోజున బట్టలు కుట్టించేది పెద్ద కలెక్టరవాలని దీవించేది! పడుకోబోయే ముందు కథలు చెప్పేది. ఇప్పుడు తన కొడుకునాని బాబుకూ అలానే చేస్తోంది!

నానమ్మ బతకాలి!

అవును నానమ్మ బతకాలీ!

బతికితేనే మంచిది ఏ విధంగా చూసినా కాపోతే మందులకే ఖర్చు కానీ ఇది కన్ను మూస్తే అయే ఖర్చు మాత్రం వేలు దాటుతుంది.

కానీ

నానమ్మ బతుకుతుందా?

వయసు పైబడింది. చివుళ్ళు ముదురుతాయి. పండుతాయి. పండినవి రాల్తాయి. ఇది ప్రకృతి ధర్మం!".

అలా ఆలోచించుకుంటూ వెళ్ళాడు. ఇంజక్షన్లు తెచ్చాడు ఈలోగా తండ్రి అందరికీ వైర్లిచ్చాడు. తండ్రిమీద కస్సుమన్నాడు వెంకట్రావుని మందలించింది అనసూయ.

సాయంకాలానికి పెద్దత్తా మావయ్యా పిల్లలూ చిన్నత్తా పిల్లలూ, బుచ్చత్తా, చిట్టత్తా పిల్లలూ, చిన్నమ్మమ్మా చిన్న తాతా అందరూ దిగారు. నారాయణమ్మ పరిస్థితిలో మార్పులేదు. అందరూ కాసేపు గొల్లుమన్నారు.

అదే సమయంలో "నాన్న గారూ! రూపాయి ఉంటే ఇవ్వరూ?" అన్నాడు నానిబాబు.

"దేనికీ?"

"తాతమ్మ బతకాలని దేవునికి ముడుపు కడతాను"

"రూపాయిలేదు, పాపాయీ లేదుపో" అని కసురుకున్నాడు వెంకట్రావు. వాడు బిక్కముఖం వేసాడు. వెంకట్రావు కి జాలివేసింది. జేబులోంచి రూపాయి నాణెం తీసి ఇచ్చాడు.

ఆ తరువాత నాలుగు రోజులు గడిచాయి. నారాయణమ్మ కన్ను తెరవలేదు. పరిస్థితిలో మార్పులేదు. డాక్టర్ మాత్రం ప్రాణాపాయం తప్పిందన్నాడు.

ఇంటినిండా జనం!

గోల!

వెంకట్రావు బజారుకెళ్తున్నాడు. తండ్రీ చీటీ ఇస్తున్నాడు. తల్లి మరో చీటీ ఇస్తోంది. భార్య ఇంకో చీటీ ఇస్తోంది. వెంకట్రావు చిరమరలాడుతూ వెళ్తాడు. అప్పులు చేస్తాడు. సరుకులు తెచ్చి, ఇంట్లో పోస్తాడు. తను మాత్రం పిప్పి అవుతున్నాడు! అందరూ తింటున్నారు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. కాఫీలు తాగుతున్నారు. టిఫెన్లు చేస్తున్నారు. నవ్వుకుంటున్నారు. గుర్తొచ్చినప్పుడు నానమ్మదగ్గర కూర్చొని దాని ముచ్చట్లు చెప్పుకుంటున్నారు.

ఆ రోజు ఉదయం నరసింహం భార్య చిన్నాడపడుచుకి కాఫీ అందిస్తోంది.

"వదినా, కాఫీ ఏంటి డికాషన్‌లా వుంది? పాలు లేవా?" అంది.

"లేదమ్మా! ఇక్కడ పాల సొంపే అంత. ఈపాలతో కాఫీ రంగు అంతకంటే మెరుగ్గా ఉండదు" అంది.

"ఫిల్టరు కాఫీ తాగే నోళ్ళకి ఈ కాఫీ తాగుతుంటే వాంతొస్తుంది. ఈ ముసిల్ది తాను చావక, అందర్నీ ఇంకెన్నాళ్ళు ఇలా చంపుతుందో?" అంది.

వెంకట్రావుకి కోపం వచ్చింది. ఏదో అనబోయేంతలో అనసూయ అతన్ని కళ్ళతో వారించింది. " ఆఫీసుకు టైము అయింది. స్నానానికి లేవండి" అంది. స్నానం చేసుకుని తయారై ఆఫీసు కెళ్ళాడు వెంకట్రావు. మధ్యాహ్నం రెండు గంటలకి తిరిగి వచ్చాడు. భోజనానికి కూర్చున్నాడు భార్య కంచంలో పచ్చడి ప్లేట్లో ఆవకాయ వేస్తూ "కూర తేకుండా వెళ్ళిపోయారేమిటి? మీ చిన్నత్త చాలా రాద్ధాంతం చేసింది" అంది అనసూయ.

ఏం? వాళ్ళో పూటకి కూర తెస్తే ఏం పోయింది?"

"వాళ్ళెందుకు తెస్తారండీ?"

"ఎందుకు తేకూడదు?"

"ఇది వాళ్ళిల్లు కాదు గనక తొడమీద గిల్లింది మెల్లిగా అంటూ నోరు చేయొద్దని మందలించింది. భోంచేసి వాలు కుర్చీలో వాలాడు. బద్ధకంగా దూరంగా అత్తలూ, మామలూ, ఇంటికొచ్చిన చుట్టాలంతా పేకాడుతున్నారు. అనసూయ ఏదో నవలలో మునిగింది.

"అమ్మా! అయిసుకొనవే" అన్నాడు నారాయణమ్మ చిన్న కూతురు కొడుకు.

"తెచ్చుకోరా!" అందామె.

పిల్లలంతా గోలచేసుకుని అయిసువాడి మీద పడ్డారు.

"ఒరే డబ్బంతా మీ అమ్మే కొట్టేసింది. మాకూ తెండర్రా!"

అన్నాడు నారాయణమ్మ పెద్దల్లుడు.

"ఎందుక్కాదూ? ఇంకా డిన్నర్ పెట్టమనలేదు" అంది.

"పెడితే తప్పా?".

"అబ్బే తప్పేమవుతుంది? పచ్చడి మెతుకులు తిని ఎంత కాలం గడపగలం? మన డబ్బుతో మనం పార్టీలు చేసుకుంటే తప్పెందుకవుతుంది? మా అన్నయ్యకి అలాంటివి

తప్పనిపించవు'' అంది.

"ష్ నోర్మూయ్యవే" పెద్దకూతురంది.

"డబ్బులియ్యవే అమ్మా" తల్లిని అడిగాడు నారాయణమ్మ చిన్న కూతుర్ని లెక్కగట్టి డబ్బులిచ్చింది. ఇంకో రూపాయి వస్తుందన్నాడు. ఎందుకొస్తుందీ? నిలదీసింది. ఆమె. వాడు లెక్కచెప్పాడు. అయిసు తింటున్న నానిగాణ్ణి చూసి "ఏరా? తేరగా వచ్చిందని తినేస్తున్నావు. డబ్బులు మీ బాబిస్తాడనుకున్నావా?'' ఎత్తి పొడిచింది పిల్లలు నవ్వారు.నానిగాడికి కోపం వచ్చింది. అయిసు విసురుగా విసిరేసాడు.

"అబ్బ ఎంత రోషం వచ్చిందిరా? మీ అయ్యకే రోషం ఉంటే బాగుణ్ణు" అంది వాడి బుగ్గ మీద పొడుస్తూ.

"చెల్లీ ఎందుకలా నోరు పారేస్తావ్?" వాళ్ళక్క అంది.

"అవునే కష్టం నీకేం తెలుస్తుంది? డబ్బులిచ్చిన నాకు తెలుస్తుందిగానీ".

"మా గొప్ప డబ్బులిచ్చావు లేవే".

"అవునే. మేం ఉద్యోగస్తులం పైసా, పైసా లెక్కేసుకోపోతే ఎలా కుదురుతుంది?".

"అంటే మాకు ఉద్యోగాల్లేవనేగా నీ మాటలు?".

"నువ్వలాగే అనుకుంటే నేనేం చేయలేను'' విసురుగా అని పేకముక్క కట్టలోంచి తీసింది.

చూడు నీతో మాటలాడితే బురదమీద రాయి విసిరినట్లే అంది వాళ్ళక్క... అసి "పెద్దాళ్ళ అదుపాజ్ఞలు లేకపోతే ఇలాగే తయారౌతారు. చిన్నదానివని అమ్మముద్దు చేసింది. నీ మొగుడు వాజమ్మ అయిపోయాడు'' నారాయణమ్మ పెద్దకూతురు అంది.

"అయినా నువ్వెందుకంత సీరియస్సయిపోతున్నావు. ఎదురుగుండా నీ మాటలు వింటూ కుర్చున్న మీ ఆయన వాజమ్మో మా ఆయన వాజమ్మో తెలుస్తునే ఉంది. మీ అందరూ నన్ను అవమానించాలనే అనుకుంటున్నారన్న మాట సరే ఇక్కడ నేనింకో క్షణం వుండును. ఇంత జరిగాక కూడా ఉంటే మా ఆయన నరికి పోగులెడతారు!'' అంటూ ఏడుపులూ, నెడబొబ్బలూ పెట్టుకుంటూ లేచిపోయింది.

అంతవరకూ మవునంగా ఉన్న వెంకట్రావు సీరియస్‌గా లేచి వెళ్ళి కొడుకుని ఆ లెంపా ఈ లెంపా వాయించాడు. ఇంకా ఉండపట్టలేక వీపు మీద దభీ, దభీ మని రెండు గుద్దులు గుద్దాడు. అనసూయ వెళ్లి కొడుకుని దగ్గరకు లాక్కుని గుండెలకదుముకుంది.

"ఈ వెధవనుండేగా గొడవంతా వచ్చింది?'' అన్నాడు.

"అవును వాడినుంచే వాణ్ణి చంపేయండి. పీడా నిరగడవుతుంది. అందరూ తృప్తిగా ఉండొచ్చు'' అది ఏడుస్తూ.

"చూసారా, చూసారా? అదెంత మాటలంటోందో? దాని కొడుకును చంపమని నేను చెప్పానా? ఆవద లాంటి కాఫీ లిచ్చినా తాగాను. కటిక కారపు పచ్చళ్ళూ మింగాను. పిల్లలకూ పెట్టాను. ఇన్ని మర్యాదలు చేసారు. చాలు ఇక ఒక క్షణం ఉండేది లేదు. ఇప్పుడే చెప్తున్నా ఆ

ముసిల్దీ చచ్చినా ఈ గడప తొక్కేది లేదు" అని ఇంట్లో కెళ్ళి బట్టలన్నీ సర్దుకొని, పిల్లలని ఈడుచుకుని వెళ్ళిపోయింది. ఎవరెంత చెప్పినా వినకుండా.

మర్నాడు మధ్యాహ్ననికి నారాయణమ్మ స్పృహలోకి వచ్చింది. చుట్టూ చూసింది. "నానీ!' పిలిచింది. అక్కడే ఏదో పనిలో ఉన్న నానిబాబు ఆశ్యర్చంగా చూసాడు కేరింతలు పెట్టాడు. చప్పట్లు "తాతమ్మ లేచింది". అరిచాడు. అందరి ముఖాల్లో నవ్వులు వెలిగాయి.

"ఉరే. వీళ్ళంతా ఎప్పుడొచ్చారా?" హీనస్వరంతో అడిగింది. అందరూ నారాయణమ్మ చుట్టూచారారు. కొడుకు అంతా వివరించాడు. "అయో! ఎందుకర్రా, తొందరపడ్డారు? ఏదో చిన్న చికాకు చేసిందంతే! అయినా నాకు తొంభై దాటితేగానీ భగవంతుని పిలుపు రాదర్రా. మా అమ్మ, అమ్మమ్మా అందరూ తొంభైదాటి బతికారు" అంది ఆ తరువాత రెండు రోజులకి లేచికూచుంది. జరిగిన అన్ని విషయాలూ తెలుసుకుంది. ఆఫీసుకెళ్ళిపోతున్న వెంకట్రావుని పిలిచింది. "నాయినా, వెంకూ! నాన్నకి చెప్పలేకపోయావట్రా. ఎందుకురా, అనవసరంగా అందరికీ కబుర్లు పెట్టేసారు? అయినా పండుటాకు ఎప్పుడో ఒకనాడు రాలకమానదు. డబ్బు ఖర్చు అసలే భారం అంతా నీ ఒక్కడి మీద పడిపోతున్నది. వీడికి బుద్ధి రాదు" అంది.

ఆ మాటలకు వెంకట్రావు ఖంగుతిన్నాడు. అతని మనసులో అనుకున్న మాటలే నానమ్మ నోటంట ఎలా వచ్చాయా?" అనుకొని కాసేపు నానమ్మతో మాట్లాడి లేచాడు.

మరో వారం రోజులకి నారాయణమ్మ లేచింది. ఎంగిలి పడింది. లేచి చిన్న చిన్న పనులు చేసుకుంటోంది. చుట్టాలు పల్చబడ్డారు.

మే నెల వచ్చేసిందేమో. సూర్యుడు తన ప్రతాపం చూపెడు తున్నాడు. రాత్రి ఏడెనిమిదయినా వేడి తగ్గటం లేదు. ఇళ్ళల్లో ఉండలేకపోతున్నారు.

గాలి లేదు. కరెంటూ లేదు. అందరూ మంచాలు వాకిళ్ళలో వేసుకున్నారు. వాకిట్లో నరసింహం ప్రక్కపడుకున్న నానిబాబుకి తెలిసి వచ్చి చుట్టూ చూశాడు. వాడికి తాతమ్మ కనిపించ లేదు. సావిడి లోంచి తాతమ్మ దగ్గరకు వెళ్ళాలి. తాతమ్మ వీధిలో పడుకుంది. సావిడి తలుపులు వేసి ఉన్నాయి. చుట్టూ తిరిగివెళ్ళాడు.

"తాతమ్మా!" పిలిచాడు.

"నానిబాబూ!" తడిమి దగ్గరకు తీసుకుంది" నిద్రపోలేదా కన్నా" అంది.

"ఇప్పుడే కుసుకు పడుతోందిరా!" విసనికర్రతో విసురుతూ అంది.

"తాతమ్మా! కథ చెప్పవూ?"

నవ్వుకుంది తాతమ్మ కథ ప్రారంభించింది. కథ వింటూ వాడు నిద్రలోకి జారుకున్నాడు. నారాయణమ్మకీ కళ్లుమూతలు పడ్డాయి.

రాత్రి సగభాగం దాటింది.

గోల!

ప్రళయం సంభవించినట్లు, హాహాకారాలు! ఆర్తనాదాలు!

"కలా? నిజమా?" ఉలిక్కిపడి లేచింది నారాయణమ్మ జనం పరుగులు తీస్తున్నారు. కళ్లు సులుముకుంది. చెంబుడు నీళ్ళు త్రాగింది. చుట్టూ చీకటి మసిరాల్తున్నట్లు ఎవర్ని పిల్చినా ఎవరూ పలకటంలేదు.

"ఓ లమ్మో బుగ్గయినా పోనాదిరా! ఊరంతా దేవుడో!".

ఆడాళ్ళు గోలతో పరుగులు!

"నరిసిమ్మం గారూ! నెగండి. ఊరు తగలడిపోతుంది" ప్రక్కింటి పేరన్న కేకలు నారాయణమ్మ చెవిలో పడ్డాయి.

నరసింహంలో ఒణుకు ప్రారంభం అయింది. భార్యని లేపాడు. అనసు ఇంట్లో పడుకుంది. వెంకట్రావు చాలా సేపు వాకిట్లోనే పడుకున్నాడు. ఇంట్లోకి పోయినట్లున్నాడు. పెద్ద చెల్లెలూ, పిల్లలూ లేచారు. నరసింహం గదితలుపులు బాదాడు అనసు లేచింది. "ఏమయింది?" తలుపుతీసి అడిగింది.

"అమ్మో! లేవండి, ఊరు కాలిపోతోంది. అన్నాడు నరసింహం. అనసూయ రెండు, మూడుసార్లు గట్టిగా పిలుస్తే కాని వెంకట్రావు లేవలేదు. విషయం విని ఉన్నపళంగా లేచాడు. వాకిట్లో కెళ్ళి చూసాడు.

ఇంకేముంది?

మంటలు మిన్నుముడుతున్నాయి. దట్టంగా నల్లగా పొగలు భయంకరంగా పేలుళ్ళు మంటకు గాలి తోడయింది. ఒకళ్ళని ఒకళ్ళు వెంటబెట్టుకుంటున్న ఆట పిల్లల్లా మంటల కొసలు ఒకసారి కుడివైపునకు, మరోసారి ఎడమవైపుకు పరుగులు తీస్తున్నాయి. మధ్యలో అలసిపోయినట్లు మంటలు నిలిచి నిలుపునా కనిపిస్తున్నాయి.

చెట్లపై పక్షులు చుట్టూ ఎగురుతున్నాయి. గొర్రెలు... మేకలూ... కోళ్ళు... ఊర కుక్కలూ అరుపులు! నిల్వ ఉన్న ధాన్యం, వేరుశనగకాయలు కాలుతున్న వాసన!

చేతికందిన సామాన్లు వెంకట్రావు రెండు చేతులతోనూ పట్టుకొని ఇంట్లోంచి పెరట్లో పడేస్తున్నాడు!

"నాన్నా! మరెళ్ళకు మంటలు ఈ వైపుకే వచ్చేసాయి." అని లోనికెళ్తోన్న కొడుకును వెళ్ళనివ్వకుండా ఆపేసారు తల్లి దండ్రులు.

ఎదురుగా ఉన్న ఎలిమెంటరీ స్కూల్లో జనం సామాన్లు పోగేసుకుని జనం కాపలాగా ఉన్నారు. అలగాజనం పేగులు తెగేటట్లు ఏడుస్తున్నారు. అంతలో

"ఒరే అన్నయ్యా! కొంపలంటుకున్నాయిరా?" నరసింహంతో అతని పెద్దచెల్లి

"ఏమయిందమ్మా?"

"అమ్మ ఉండిపోయిందిరా!" అంది.

నరసింహం నెత్తిమీద పిడుగుపడింది. అందరూ స్థాణువుల్లా ఉండిపోయారు. క్షణకాలంలో తేరుకున్న నరసింహం ముందుకు వెళ్ళబోతుంటే, "ఏమండీ! ఎక్కడికెళ్తారు?" అంది అతని భార్య.

"అమ్మా!...అమ్మా!" చిన్న పిల్లాడిలా బావురు మన్నాడు. అక్కడికక్కడే గుండ్రంగా తిరుగుతూ.

"నాన్నా! ఇప్పుడెలా వెళ్తారు? చుట్టూ మంటలు కమ్ముకొస్తున్నాయి" అన్నాడు కొడుకు నరసింహం ముందుకూ వెళ్ళలేక, వెనక్కి రాలేక నిలబడి పోయాడు రెండు చేతులూ నెత్తిమీద పెట్టుకుని కుప్పలా కూలిపోయాడు. "అమ్మా ఎంత ఘోరం జరిగిపోయిందే? ఇంతకాలం. బతికి నీ బతుకిలా ముగుస్తుందనుకోలేదే? మొన్నయినా పోయావేకాదే. మమ్మల్ని కంటికి రెప్పలా చూసుకునేదానివి. నిన్ను మేమెవరం పట్టించుకొ లేదే?" అని ఏడుస్తున్నాడు. అతనితోనే అతని భార్యా పెద్ద చెల్లెలు ఏడుస్తున్నారు. వెంకట్రావు మామ్మని తల్చుకుని కుమిలిపోతున్నాడు.

"ఏమండీ, బాబండీ, బాబెక్కడున్నాడండీ?" అంది అనసూయ అందరూ త్రుళ్ళిపడ్డారు. అక్కడి దృశ్యం ఒక విషాదం నుండి మరో విషాదానికి మారింది. "నాన్నా! రాత్రి బాబు మీ ప్రక్కపడుకోలేదా? అడిగాడు వెంకట్రావు.

"అవును. నా ప్రక్కనే ఉండేవాడు"

"ఏమండీ, ఆ తరువాత వాడు అత్తగారి దగ్గరకెళ్ళినట్టున్నాడండీ!" అంది నరసింహర భార్య అనసూయ కెవ్వున కేకవేసి పడిపోయింది. వెంకట్రావు కాళ్ళు చచ్చుబడినట్లయిపోయాయి. మెదడు మొద్దుబారిపోయింది. నరసింహం, అతని భార్యా పెద్దచెల్లెలూ, పిల్లలు గుండెలు బాదుకుని ఏడుపులు మొదలు పెట్టారు. చుట్టుప్రక్కల జనం గుమిగూడారు. విషయం విన్నారు. నరసింహం కుటుంబం సానుభూతి ప్రవాహంలో తేలింది. అనసూయ ముఖం మీద నీళ్ళు చల్లారు. ఆమెకు పేగులు తెగిపోతున్నాయి. "ఏమండీ! బాబండీ.. నా బాబు దగ్గరకి నేవెళ్ళిపోతానండీ". అందర్నీ విదిలించుకుని మంటల మధ్యాలోకి పరుగుతీసింది.

అనసూ!... ఎలా వెళ్తావు?" అందరూ ఆమెను పొదిని పట్టుకున్నారు. వెళ్లినా లాభం లేదని వెంకట్రావుకు తెల్సుఇందాక నానమ్మ ఉండిపోయిందన్నప్పుడు గుండె కలుక్కుమంది. ఒళ్ళంతా చెమటెక్కింది. అయినా భయంతో ముందుకు అడుగెయ్యలేకపోయాడు.

కానీ

ఇపుడో? పేగు బంధం అతణ్ణి నిలబడనివ్వటం లేదు. "నానిగాడు లేకుండా ఎలా బతకగలను?" అతనిలో పుత్రవాత్సల్యం అతన్ని మరో ఆలోచనకి తావివ్వనీయకుండా చేసింది. ముందుకురికాడు.

"బాబూ! ఎక్కడికెళ్తావు?" నరసింహం కొడుకును పట్టుకున్నాడు. గట్టిగా కొడుకేమైపోతాడోనని అతని భయం! అప్పుడే ఇంటి వెన్ను పట్టికి వేసిన చేవదూలం కాలిన మంటలో పడింది. చుట్టూ ఉన్న జనం ఎవరూ వెంకట్రావుని ముందుకెళ్ళనివ్వటం లేదు. అదో స్మశానంలా తయారయింది. ఊరిజనం అక్కడే ఉన్నారు.

"ఎంత గోరం జరిగిపోనాది?" అందరినోటా ఒకటే మాట.

"ముందు పిల్లల్నీ ముసలమ్మనీ సూసుకోరా?" ఎవరో అన్నారు.

"నిద్రమత్తులో అందరూ వచ్చేసారు. గుర్తుంటే ఇలా జరుగుతుందా?'' కోపంతో అంది నారాయణమ్మ పెద్ద కూతురు.

"సింహం!... సింహం!...'' ఎక్కణ్ణించో పిలుపు.

ఆ గొంతు నూతిలోంచి వస్తున్నట్లుంది. రాను రాను దగ్గరవుతోంది. అది తల్లి గొంతే!

"అమ్మ పిలుస్తోంది!'' అన్నాడు నరసింహం.

నరసింహానికి పిచ్చిపట్టిందనుకున్నారంతా.

మళ్ళీ అదే పిలుపు!

ఈ సారీ అంతా విన్నారు.

"నిజమేరా, అన్నయ్యా ఆ గొంతు అమ్మదే!'' పెద్ద చెల్లి అంది. అందరూ అటు పరిగెత్తారు.

"నాన్నా! నరసింహం". "అమ్మా! పరుగెత్తుకుంటూ వెళ్ళాడు కొడుకు.

నారాయణమ్మ చేతిలో నానిబాబు దగ్గరకు తీసుకొని వస్తోంది.

"అమ్మా!''

"బాబూ! అందరూ ఇక్కడే ఉన్నారా? వెంకన్న ఎక్కడ అనసులేచిందా? కోడలూ, అమ్మాయీ "అంటూ పేరు పేరునా అడిగింది.

అనసు ఒక్క అడుగులో వెళ్ళి నానిగాణ్ణి చుట్టేసింది.

"అమ్మా! వీడెలా వచ్చాడు నీ దగ్గరకి?''

"రాత్రి కథ చెప్పమని వచ్చాడు వెర్రినాగన్న. ఈ రాత్రి వీడేమయిపోతాడినని. భయం వేసింది. నిద్రలో ఉన్న వీణ్ణి ఎత్తుకుని పరుగుతీస్తుంటే పడిపోయాను వెర్రికుట్టికి దెబ్బతగిలింది. మీరెక్కడున్నారో? ఏమయారో తెలీక విలవిలలాడిపోయాను. రావాలంటే మంటలు... ఆ చెరువు గట్టుదాటి వల్లకాడు మధ్యలోంచి వచ్చాను. నాన్నా... వెంకూ! ఇలారా!'' అంటూ వెంకన్నను అక్కున చేర్చుకుని ముద్దు పెట్టుకుంది.

" నానమ్మా! నువ్వు మా పాలిట దేవతవే. నీ మనసు పూతరేకులాటిదే. మేమంతా నిన్ను మరచి వచ్చేసాం నువ్వు మాత్రం మా కోసం ఎన్ని అవస్థలు పడ్డావు?'' అని నానమ్మని చుట్టేసాడు వెంకట్రావు.

తన కొడుకును కాపాడి, తన వంశాన్ని బతుకునూ బంగారం చేసిన నానమ్మకు విలువ కట్టగలడా? ఆమెలో దైవమే కనిపించింది.

అందుకే పాదాలు చుట్టేశాడు. కన్నీటితో అభిషేకం చేశాడు. వెంకట్రావే కాదు నరసింహం, భార్యా అనసూ, పెద్దచెల్లెలూ అందరూ!

నారాయణమ్మ కూర్చుని అందర్నీ రెండు చేతుల్లోకి తీసుకుంది. పక్షి తన పిల్లల్ని రెండు రెక్కలు చాచి ఇముడ్చుకున్నట్టు!

(29-3-1999) జాగృతి వారపత్రిక నుండి)

❀ ❀ ❀ ❀